క్లుప్తంగా

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం



ప్రవచనాలు వినిపిస్తున్న పండిట్ మదన్ మోహన్

తాండూరు టౌన్: రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక గగరాణి కల్యాణ మండపంలో సోమవారం సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. పండిట్ మదన్‌మోహన్ నేతృత్వంలో 21 మంది జంటలు రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పండిట్ మదన్ మోహన్ శివపార్వతుల వివాహ మహోత్సవం, శివలీలలు, శివ మహత్యం తదితర అంశాలపై ప్రవచనం గావించారు. గత నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజస్థానీ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్ మన్మోహన్ సార్దా, వర్షా కైలాస్‌సార్దా , కోశాధికారి కల్పనాఆనంద్ రాఠి, హేమ, వైజయంతి, రాధిక, రీతు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ రాఘవేందర్‌ను సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

ధారూరు: నూతన ఎస్‌ఐగా ధారూరుకి వచ్చిన రాఘవేందర్‌ను సోమవారం బీఆర్‌ఎస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, హఫీజ్, చంద్రమౌళి, భీంసేన్, చిన్నయ్యగౌడ్, బాల్‌రాజ్‌నాయక్ పాల్గొన్నారు.

దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

అనంతగిరి: ఒడిశాలో బాలికపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా సోమవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ దుర్ఘటనకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిచరణ్, శరత్, అరవింద్, మంజునాథ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్

మొయినాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 23న చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ అన్నారు. సోమవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేస్తోందన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని.. ఫీజుల నియంత్రణకోసం సమగ్ర చట్టం చేయాలనే డిమాండ్‌లతో చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

చేరదీసి.. సపర్యలు చేసి



మతి స్థిమితం లేని వ్యక్తితో కానిస్టేబుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన కానిస్టేబుళ్లు.. సపర్యలు చేశారు. భోజనం తినిపించి అనాథశ్రమంలో చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వండర్‌లా పరిసరాల్లో చిరిగిన బట్టలు, మాసిన జుట్టు, చేతిలో గొడ్డలితో ఓ వ్యక్తి వింతగా ప్రవర్తిస్తూ తిరుగుతున్నాడు. ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ బురుగు బాల్‌రాజ్, కానిస్టేబుల్ శివాజీలు ఆ యువకున్ని చేరదీశారు. గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు రాబట్టే యత్నం చేసి విఫలం అయ్యారు. అనంతరం స్నానం చేయించి, కొత్తగా దుస్తులు వేయించారు. భోజనం తినిపించి మాతృదేవోభవ ఆశ్రమానికి తరలించారు. అనాథను చేరదీసి, మానవత్వం చాటుకున్న కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు, ప్రజలు అభినందించారు.



ఎన్కేపల్లిలో కళకళలాడుతున్న మొక్కజొన్న పంట



మొరంగపల్లిలో చిగురించిన పత్తి

భూమికి పచ్చని రంగేసినట్టు

మోమిన్‌పేట: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోశాయి. నాటిన 20 రోజులకే వరుణుడు కరుణించక మొక్కలు వాడిపోయాయి. ఇటీవల దంచి కొడుతున్న వానలకు పంటలు ఆకుపచ్చని రంగుతో కళకళలాడుతున్నాయి. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటను ఎక్కువగా సాగు చేశారు. జూన్ నెలలో ఒకటి రెండు వానలు కురవడంతో విత్తనాలు విత్తుకున్నారు. వర్షాలు లేక పంటల ఎదుగుదల నిలిచిపోయింది. ప్రస్తుతం వర్షాలతో భూమికి ఆకుపచ్చ తోరణం అలుముకుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా మధ్యాహ్న భోజనం!

- నాణ్యత పాటించేలా పకడ్బందీ చర్యలు
- కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ తనిఖీలు
- ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కోక్క పాఠశాల ఎంపిక



కేజీబీవీలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్ (ఫైల్)

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పక్కాగా అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంపై హెచ్‌ఎంలకు వేసవి కాలంలో ప్రత్యేక శిక్షణ సైతం ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రత, వంటలపై అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ తనిఖీలు చేపట్టడం మొదలు పెట్టారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో పాఠశాలను ఎంపిక చేసుకొని విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి కలిసి తింటున్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

మొత్తం 71 పాఠశాలలు

మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 71 పాఠశాలలున్నాయి. అందులో 10 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 52 ప్రాథమిక పాఠశాలలతో పాటు ఓ కేజీబీవీ కూడా ఉంది. వీటిలో మొత్తం 5,816 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ కచ్చితంగా అమలు చేయాలని, నాణ్యమైన ఆహారం అందించేలా తనిఖీలను నిర్వహించాలని ఉన్నతాధికారులకు బాధ్యతలు అందించారు. ప్రతి బుధ, శుక్రవారం అధికారులు తనిఖీ చేసిన ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది. నాణ్యత లేకుంటే నివేదికలను తయారు చేసి పంపించాలి. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓకు ఈ తనిఖీల బాధ్యతలను అప్పగించారు.

నివేదికలు అందిస్తున్నాం



పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాలను తహసీల్దార్, ఎంపీడీఓతో కలిసి పరిశీలిస్తున్నాం. ఒక్కొక్క పాఠశాలను ఎంపిక చేసుకొని బుధ, శుక్రవారాల్లో విజిట్ చేస్తున్నాం. అక్కడ భోజనాలు పరిశీలించి ఫొటోలను తీసుకుంటున్నాం. నాణ్యత లోపిస్తే నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తున్నాం.

– వెంకట్, ఎంఈఓ, దోమ

నాణ్యతే ప్రధానం



ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వంట గదులు, మధ్యాహ్న భోజనానికి తయారు చేసే పరికరాలు నాణ్యమైనవి వాడుతున్నారా? లేదా పరిశీలిస్తున్నాం. నాణ్యత లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నాం.

– గోవిందమ్మ, తహసీల్దార్, దోమ

నిర్వహణ లేక నిరుపయోగం



నిరుపయోగంగా మెట్లకుంట బస్‌షెల్టర్

బొంరాస్‌పేట: ప్రయాణికుల సేద తీరడం కోసం రెండు దశాబ్దాల క్రితం వన సంరక్షణ సమితి నిధులతో మండలంలో నిర్మించిన వీఎస్‌ఎస్ బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని మెట్లకుంట, బొంరాస్‌పేట, బురాన్‌పూర్, మదన్‌పల్లి, బొట్లోనితండా, కొత్తూరు, ఎన్కేపల్లి, తదితర గ్రామాల్లో రహదారి పక్కన, గ్రామం ప్రధాన స్థలాల్లో ప్రయాణికులకు వేసవికాలం, వర్షాకాలాల్లో ఉపయోగకరంగా ఉండేందుకు నిర్మించారు. ప్రస్తుతం కొన్నాళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పాడుబడి ఉన్నాయి. పిచ్చిమొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



బుర్రితండాగేటు వద్ద బస్‌షెల్టర్ దుస్థితి

నర్సింలు కుటుంబాన్ని ఆదుకోవాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో ఈ నెల 17న విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో పశువులు మృతిచెందాయన్నారు. ఇటీవల చిన్న ఎల్కిచర్లలో ఓ రైతు మృతి చెందాడని, ప్రస్తుతం గాలిగూడలో నర్సింలు మృతిచెందడం బాధాకరమన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కులవృత్తే జీవనాధారం

నందిగామ: నాయీ బ్రాహ్మణేతరులు సెలూన్లు నడుపొద్దని, కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తమ కడుపులు కొట్టదని నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పుట్టుక నుంచి చావు వరకు అన్నింట్లో తాము ముందుంటామన్నారు. ఇటీవల తమ కులం, మతం కాని వ్యక్తులు తమ వృత్తిలోకి ప్రవేశించి తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి ఆస్తులు లేకుండా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ఇతరులు తమ వృత్తిలోకి ప్రవేశించినట్లయితే ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది నాయీ బ్రాహ్మణులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

సేవలను విస్తృతం చేయాలి

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ



రవికుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధిలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని కేకేఆర్ కన్వెన్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ 14వ వార్షికోత్సవ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన క్లబ్ అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డి, సెక్రటరీగా విజేందర్‌రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరామ్‌గౌడ్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన క్లబ్ సభ్యులతో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శశికాంత్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవాదృక్పథాన్ని అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. పేదలకు చేయూతనిస్తూ వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యులు శరత్‌చంద్రబాబు, ఎంపీఎస్.రంగయ్య, రీజియన్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ అమరేందర్‌రెడ్డి, కో చైర్మన్ డాక్టర్ శివానంద్, మదన్‌మోహన్‌రెడ్డి, శివనాగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: రైతులకు కావాల్సినంత యూరియా ఫర్టిలైజర్ దుకాణ సముదాయాల్లో అందుబాటులో ఉందని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఉన్న పలు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించి యూరియా అందుబాటులో ఉందా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో సుమారు 190 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. కొందరు ఉద్దేశపూర్వకంగా వదంతులు పుట్టించి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, నాయకులు వంశీధర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలు పరిష్కరించండి



అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అతిథి అధ్యాపకులు

కొడంగల్ రూరల్: తమకు వసతితో కూడిన ఇతర అలవెన్సులు కల్పించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ(అతిథి అధ్యాపకులు) డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొడంగల్, పరిగి, కోస్గి, మద్దూరు కళాశాలల గెస్ట్ అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నినదించారు. గత శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను నెరవేర్చాలని కోరారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఆటో రెన్యూవల్ చేయాలని, ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, 12 నెలల వేతనం చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అతిథి అధ్యాపకులకు రూ.52 వేల వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు రమేశ్, బి.మోహన్, బి.నర్సింలు, కేశవులు, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకట్రాములు, మణికంఠ, మాణిక్యప్ప, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మందిపల్‌లో రుద్రాభిషేకం

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరధిలోని మందిపల్ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహిస్తామని రాష్ట్ర జంగమ సమాజం ప్రధాన కార్యదర్శి, ఆలయ అర్చకుడు మఠం రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో లోకకల్యాణార్థం మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 8గంటల నుంచి ప్రారంభించి హైందవ ధర్మంపై ప్రవచనాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ మంగళవారం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని 21 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, తదితరులు హాజరవుతున్నారని చెప్పారు.

మహిళా సంఘాల సభ్యులకు..

పరిగి: మహిళా సంఘాల సభ్యులకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మహిళా సంఘాల రుణాల చెక్కులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అందజేస్తారన్నారు. అనంతరం పట్టణ కేంద్రంలో కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు సకాలంలో కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు రైతు నేస్తం వీసీ

బంట్వారం: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ బుగ్గాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహిస్తున్నామని కోట్‌పల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. పంటలలో వ్యవసాయ యాంత్రీకరణపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వీసీకి రైతులందరూ సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

నూతన బోరు ఏర్పాటు

దోమ: మండల పరిధిలోని దాదాపూర్ తండాలో కొంతకాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు కాంగ్రెస్ పార్టీ నేతలు నూతన బోరును వేయించారు. సమస్యను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన బోరు వేయించాలని నిధులు కేటాయించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ నేతలు తండాలో సోమవారం నూతన బోరును వేయించారు. గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శేఖర్, నేతలు పాల్గొన్నారు.

రేపు రేషన్ కార్డుల పంపిణీ

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు మండలం, పట్టణం కలిపి 3,140 కొత్త రేషన్ కార్డులు, అందులో 4,327 కొత్త సభ్యులు చేరారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పట్టణంలోని సల్లా గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సొంతింటి కలకు మోక్షం



ఎన్కేపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

- ఇందిరమ్మ ఇళ్లకు మహిళా సంఘాల రుణ సదుపాయం
- త్వరితగతిన నిర్మాణానికి లబ్ధిదారుల ప్రయత్నం

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మహిళా సంఘాలు రుణ సదుపాయం అందిస్తున్నాయి. దీంతో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం సులభతరం అవుతుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరవడంతో వాటికి సంబంధించి ప్రొసీడింగ్స్‌ను ఇప్పటికే అందించారు. మొదటి దఫా 242, రెండో దఫా 306 ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామాల్లో మార్కింగ్ సైతం ఇవ్వడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందిరమ్మ ఇంటి చుట్టుకొలత 600 చదరపు అడుగులు దాటకుండా ఉండేలా మార్కింగ్ ఇస్తున్నారు. గ్రామాల్లో ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మహిళా సంఘాల ద్వారా రుణాలను తీసుకొని బిల్లులు వచ్చిన అనంతరం అప్పును చెల్లించే వెసులుబాటును అధికారులు కల్పించారు.

పైలెట్ ప్రాజెక్టుగా ఎన్కేపల్లి

ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. అందులో పూడూరు మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆరు గ్యారంటీలను అమలు చేస్తోంది. ముందుగా రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అందించడంతో పాటు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఏడాదికి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు తీవ్ర కసరత్తు జరుగుతోంది.

విడతల వారీగా బిల్లుల చెల్లింపులు


నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుంది. బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష, స్లాబ్ లెవల్‌లో గోడలు పూర్తయితే రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, ఇళ్లు పూర్తయిన తర్వాత ఫైనల్ బిల్లు కింది రూ.లక్ష చెల్లిస్తారు.

నాణ్యతగా నిర్మించాలి

లబ్ధిదారులు 600 చదరపు అడుగులు దాటి ఇంటిని నిర్మిస్తే బిల్లులు రావు. కొలత ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలి. విడతల వారీగా బిల్లులు అందిస్తున్నాం. హౌసింగ్ అధికారులకు సహకరించాలి. బిల్లుల కోసం మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వరాదు. ఇంటిని నాణ్యతగా నిర్మించుకోవాలి. మండలంలో పూర్తయిన ఇళ్లకు బిల్లులు అందించాం.

– ముక్రం, హౌసింగ్ డీఈఈ

పేదల కల సాకారం



గత ప్రభుత్వం ఒక్క ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించాం. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల కలను నిజం చేస్తున్నాం. దివంగత సీఎం వైఎస్‌ఆర్ హయాంలో ఇచ్చిన ఇళ్లే తప్పా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎవరికీ ఇవ్వలేదు.

– సురేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు